ఈనాడు శ్రీకాకుళం

ఆదివారం అక్టోబరు 6, 2024

సంపూర్ణ విజయానికి.. సంకల్పమే రహస్యం..!

చిన్న వయసులోనే కన్నోళ్ల కష్టాన్ని గుర్తించాడు. పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబానికి చేదోడుగా నిలవాలనుకున్నాడు. ఆ యువకుడి సంకల్పాన్ని చూసి విధికి కన్ను కుట్టిందేమో.. ఊహించని ప్రమాదంలో రెండు కాళ్లు పోయేలా చేసింది. అయితేనేం కుంగిపోకుండా రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాడు. బ్యాడ్మింటన్ క్రీడలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన చాపర పూర్ణారావు. ఇటీవల జరిగిన ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం సాధించి అందరితో మరోసారి శెభాష్ అనిపించుకున్నాడు.

సాధించిన ఘనతలు..

- ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్-2024లో కాంస్య పతకం
- ఈ ఏడాది ఉగాండాలో జరిగిన పోటీల్లో మూడు పతకాలు
- గతేడాది థాయిలాండ్ వేదికగా నిర్వహించిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్‌లో రెండు కాంస్యాలు
- 2023లో ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో రజతం, మెన్స్ డబుల్స్‌లో కాంస్య పతకం

- అంతర్జాతీయ వేదికపై మెరిసిన జిల్లా క్రీడాకారుడు
- ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం



న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

పూర్ణారావు తల్లిదండ్రులు లక్ష్మణరావు, మోహిని ఊళ్లో చిన్న కిల్లీ బడ్డీ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. పేదరికం నుంచి కుటుంబాన్ని బయటకు తీసుకురావాలని ఈ యువకుడు ఇంటర్ పూర్తికాగానే 2015లో ఉద్యోగం నిమిత్తం సింగపూర్ వెళ్లాడు. 2017లో సెలవుపై స్వగ్రామానికి వచ్చినప్పుడు 21 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెన్నుపూస పూర్తిగా దెబ్బతిని.. మూడేళ్లు మంచానికే పరిమితమయ్యాడు. బెంగళూరులోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న సమయంలో వీల్ ఛైర్ బ్యాడ్మింటన్‌పై మక్కువ పెంచుకున్నాడు. యూట్యూబ్‌లో చూసి ఆటలో మెలకువలు తెలుసుకున్నాడు. ఆర్థిక దన్ను కోసం ఓ ఫుడ్ డెలివరీ సంస్థలో బాయ్‌గా పని చేస్తూనే సాధన చేసేవాడు. అలా రాకెట్ ఝుళిపిస్తూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్నాడు. ప్రస్తుతం జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్‌లో 3వ స్థానంలో కొనసాగుతున్నాడు.

పారాలింపిక్స్‌లో పతకమే లక్ష్యం..

నా ప్రతిభను గుర్తించి కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు డ్రీమ్ లెవెన్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి ఇండోనేషియా పర్యటనకు రూ. 1.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. వాటితోనే వెళ్లి టోర్నీలో విజయం సాధించాను. దాతలు సహకరిస్తే దేశం తరఫున పారాలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా కృషి చేస్తాను



- చాపర పూర్ణారావు,
అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

ఓంకార రూపిణి.. గాయత్రి..



జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు, దేవీ పీఠాలు, మండపాల్లో శనివారం విశేష పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో జగన్మాత భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీమాత రూపంలో దర్శనమిచ్చారు. అదే ఈ చిత్రం.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ట్రిపుల్ ఐటీకి నేటి నుంచి దసరా సెలవులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ తిరిగి ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.



చూస్తేనే జలదరింపు..!

కొత్తూరు మండలంలోని నివగాం గ్రామంలోనిదీ దుస్థితి.. ఇక్కడ తాగునీటి కుళాయిల చుట్టూ ఉన్న పరిసరాలను చూశారా.. ఎంత దయనీయమో.. ఇలాగైతే రోగాలు రావా..? నీళ్లు కలుషితం కావా..? చుట్టూ మురుగునీరు చేరి నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు మధ్యనే తాగునీరు పట్టుకుంటున్నారు. కాలువలు లేకపోవడంతో నీరంతా ఒక దగ్గరకు చేరి నిలిచిపోతుందని, తప్పక వెళ్లి నీరు పట్టుకుంటున్నామని వాపోయారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ బీవీఆర్ ప్రసాదరావు మాట్లాడుతూ సమస్య పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు

వారి నిర్లక్ష్యం.. వీరికి శాపం..!

- కళింగదళ్ దిగువన గెడ్డపై కూలిన దోనె గోడ



గోడ పడిపోవడంతో వృథాగా పోతున్న నీరు



గతంలో ప్లాస్టిక్ గొట్టాలు అమర్చారు ఇలా..

న్యూస్‌టుడే, మందస

గత పాలకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపమైంది. మందస మండలంలోని ప్రధాన జలాశయం కళింగదళ్ దిగువన గెడ్డపై రాజుల కాలంలో నిర్మించిన పురాతన ఇనుప దోనె గోడ కొంతభాగం శనివారం కూలిపోయింది. ఫలితంగా బెల్లుపటియా, హొన్నాలి, ఉప్పరపేట, సిద్ధిగాం, శ్రీరాంపురం, పింపిడియా గ్రామాల్లోని దాదాపు రెండువేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. 2006లో వచ్చిన భారీ వరదలకు ఈ దోనె సగభాగం దెబ్బతింది. అప్పట్లో అధికారులు ప్లాస్టిక్ గొట్టాలు అమర్చి సాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. మళ్లీ ఇప్పుడు సమస్య పునరావృతం కావడంతో సాగునీరు వృథా అవుతోంది. రైతుల సమాచారంతో జలవనరుల శాఖ సోంపేట డీఈఈ రమణ, మందస ఏఈ శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ గొట్టాలు అమర్చి సాగునీరందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

పనులు రద్దు చేసి.. నిధులు మళ్లించి..

శిథిలావస్థకు చేరిన దోనె పక్కన కొత్తగా సిమెంటు దోనె నిర్మాణానికి 2017-18 ఆర్థిక సంవత్సరంలో నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా తెదేపా ప్రభుత్వం రూ.96 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు పనులు ప్రారంభించి.. పునాదులు సైతం తవ్వారు. ఇంతలో ఎన్నికలు జరిగాయి. వైకాపా అధికారంలోకి రాగానే పనులు రద్దు చేసి.. నిధులు వెనక్కి మళ్లించింది.



వరదలకు విరిగిపోయిన దోనె(పాత చిత్రం)

ఆ తర్వాత దీని ఊసే వదిలేశారు. ఐదేళ్ల పాటు రైతులు ఇబ్బందులు పడుతూనే పంటలను సాగుచేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం మళ్లీ చొరవ తీసుకుని సిమెంటు దోనె నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

పాతపట్నంలో ఇసుకాట..!

- కప్పం కడితేనే లారీలకు దారి
- ఒడిశా అనుమతులున్నా అడ్డుకుంటున్న అక్రమార్కులు



గత నెల 22న సరుబుజ్జిలి పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని, ఉచిత ఇసుకను వినియోగదారులకు చేరువచేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుంటే పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కొద్దిరోజులుగా యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. ఒడిశా నుంచి అనుమతులతో విశాఖకు వెళ్తున్న లారీలనూ కొందరు అడ్డుకుంటున్నారు. తమ ప్రాంతం మీదుగా వెళ్లాలంటే కప్పం కట్టాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమ నాయకుడు అడ్డుకోమన్నట్లుగా చెబుతున్నారని లారీ డ్రైవర్లు వాపోతున్నారు.

ఒడిశాలోని గుణుపురం వద్ద ఆ ప్రభుత్వ అనుమతితో కొన్ని ఇసుక రేవులు నడుస్తున్నాయి. అక్కడి నుంచి బుక్ చేసుకున్న కొన్ని లారీలు కొత్తూరు మీదుగా జాతీయ రహదారికి చేరుకొని విశాఖకు వెళ్తున్నాయి. ఇదే అదనుగా కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. రెండు వారాల కిందట పాతపట్నం నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్యనేత అనుచరులమని చెప్పి కొందరు గుణుపురం సమీపంలో ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. అక్కడి లారీలు తమ నియోజకవర్గం మీదుగా రావాలంటే తమ నాయకుడిని కలవాలని, లేదంటే వాహనాలను అడ్డుకుంటామని చెప్పగా.. ర్యాంపు దక్కించుకున్న గుత్తేదారులు అందుకు ఒప్పుకోలేదని తెలిసింది.

అడ్డుకోవడం వెనుక ఆంతర్యమేంటో!

వారం కిందట కొత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఏడు లారీలను మెట్టూరు కూడలి వద్ద తెదేపా నేతలు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఇవి అక్రమమా లేదా సక్రమమా అని తేల్చడంలో జాప్యం జరిగింది. మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ్డ వద్ద అధికారికంగా నడుస్తున్న రేవు నుంచి విశాఖకు చెందిన వ్యక్తి బుక్ చేసుకున్నారు. లారీ కొత్తూరు వద్దకు రాగానే కొందరు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తే మళ్లీ ఆ నాయకుడి పేరు చెప్పారు. చివరికి అన్ని అనుమతులు ఉండటంతో వాహనాలను విడిచిపెట్టారు. ● సరుబుజ్జిలిలో కూడా పాతపట్నం నేతల ఆదేశాలతో గత నెల 22న మూడు లారీలను పోలీసులు పట్టుకున్నారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. రెండు రోజుల తర్వాత వీటిని విడిచిపెట్టారు. అసలు ఎందుకు లారీలను పట్టుకుంటున్నారు? పోలీసులకు అప్పగిస్తున్నారు? విడిచిపెడుతున్నారు? ఎందుకు కేసు నమోదు చేయట్లేదనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

వయా కొత్తూరు..

పాలకొండ నియోజకవర్గ పరిధి భామిని మండలంలో కొన్నిచోట్ల అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి లారీలు కొత్తూరు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ఈ తంతు వెనుక పాతపట్నానికి చెందిన మరో ముఖ్యనేత కుమారుడు ఉన్నట్లు సమాచారం. వీళ్లు మన్యం జిల్లాలో పలు ప్రాంతాల్లో అనధికారికంగా ఇసుక తీసుకువచ్చి రహదారిపైకి వచ్చే సరికి ఒడిశా బిల్లులు చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల మాట ఇదీ..

కొత్తూరు పోలీసుస్టేషన్ పరిధిలో పట్టుకున్న లారీలపై కేసు నమోదు చేయలేదని వాహనాలు స్టేషన్ వద్దనే ఉన్నాయని సీఐ ప్రసాద్ తెలిపారు. ఇదే విషయమై జిల్లా భూగర్భ గనులశాఖాధికారి సి.మోహన్‌రావును వివరణ కోరగా లారీలు పట్టుబడిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. సరుబుజ్జిలి స్టేషన్ పరిధిలో పట్టుకున్నవాటికి జరిమానా విధించామని తెలిపారు.

యాంత్రీకరణ విధానాలతో మేలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: యాంత్రీకరణ విధానాల్లో సాగు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని అక్కివరం, గోపీనగర్, తోటాడ గ్రామాల్లో పంట నమోదు చేపట్టిన పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవని చెప్పారు. ప్రతి రైతు సిబ్బందిని తమ పొలాలకు తీసుకువెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సాగులో యాంత్రీకరణ విధానాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం జేడీ త్రినాథరావు జిల్లాలో పంట నమోదు ప్రక్రియ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. సబ్ డివిజనల్ అధికారి బగ్గు రజనీ, వ్యవసాయశాఖాధికారి మెట్ట మోహనరావు, ఇఫ్కో డీఎం టి.లోకేశ్, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అక్కివరం వద్ద పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆదిశక్తివి నీవే.. అన్నపూర్ణవు నీవే..!


పాతశ్రీకాకుళంలో ఉమాజఠలేశ్వరాలయంలో చామంతుల అర్చన

దుర్గా నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా వైభవంగా సాగుతున్నాయి. ఆలయాలు, దేవీ పీఠాలు, మండపాల్లో శనివారం భక్తులు శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే బృందం


ఇచ్ఛాపురం: ఫకీరుపేటలో కొలువుదీరిన కనకదుర్గమ్మ


వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలో పూజలందుకుంటున్న అమ్మవారు


బలగ కాలభైరవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలతో వేధింపులా?


శ్రీకాకుళంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు, అంతర్జాల శిక్షణ పేరిట తపాలా ఉద్యోగులపై వేధింపులు తగవని ఎన్‌ఎఫ్‌పీఈ రాష్ట్ర సమన్వయ కమిటీ, ఏఐజీడీఎస్‌యూ జిల్లా నాయకులు గణపతి, బాబూరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా తపాలాశాఖ ఉద్యోగులు గత మూడు రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. ఇందులో భాగంగా శనివారం తపాలాశాఖ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. వ్యక్తిగతంగా దూషణలు చేయడం మానుకోవాలని జిల్లా నాయకులు నందికేశ్వరరావు హెచ్చరించారు.

వీవోఏల ఆందోళన బాట



జిల్లావ్యాప్తంగా వెలుగు సంస్థలో పని చేస్తున్న వీవోఏలు నిరసన బాట పట్టారు. బకాయి వేతనాలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండు చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు వీవోఏలు మాట్లాడుతూ నెలవారీ జీతాలు సక్రమంగా అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రాజకీయ వేధింపులకు పాల్పటం సరికాదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఎ.మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి అసిరినాయుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

నేడు ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి సీనియర్ బాలుర జట్టు పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధానకార్యదర్శి ముని శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8వ తేదీ నుంచి విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 73869 56065 నంబరును సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవోలు


టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి


కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మొక్క అందిస్తున్న శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష

కలెక్టరేట్(శ్రీకాకుళం), కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలుగా నియమితులైన కె. సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 2023 గ్రూప్- 1 బ్యాచ్‌కు చెందిన వీరు ఇటీవల శిక్షణ పూర్తి చేసి ఆర్డీవోలుగా నియమితులయ్యారు. సాయిప్రత్యూష బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీవోలు నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఆటలు... ప్రాణాలతో చెలగాటం

- శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ ఆటలకు బానిసయ్యారు. భార్య, ఇద్దరు పిల్లలతో ఉన్నంతలో జీవితం సాఫీగా సాగిపోయేది. కాలక్షేపానికి మొదట రూ.10తో మొదలు పెట్టి రూ.లక్షల్లో నష్టపోయారు. స్నేహితులు, బంధువుల వద్ద రూ.కోటి వరకు అప్పులు చేశారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఒత్తిడికి గురై చివరకు ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.
- సంతబొమ్మాళి మండలానికి చెందిన ఓ కానిస్టేబుల్ ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడి తెలిసిన వారి దగ్గర అప్పులు చేశారు. వారికి సమాధానం చెప్పలేక, ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడటంతో కుటుంబం పరిస్థితి చిన్నాభిన్నమైంది.
- బోరుభద్ర ప్రాంతానికి చెందిన ఓ యువకుడు చరవాణిలో ఆన్‌లైన్ ఆటలకు బానిసయ్యారు. ఎక్కడా అప్పు దొరక్క పోవడంతో ఓ మహిళను గాయపరిచి మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. గ్రామంలో ఈ విషయం తెలిస్తే పరువు పోతుందని చివరకు రైలు కింద పడి తనువు చాలించారు.
- మూలపేట పోర్టు నిర్వాసిత ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ప్రభుత్వం యూత్ ప్యాకేజీ పథకంలో అందజేసిన రూ.10 లక్షలకు పైగా నగదును మూడు రోజుల్లో ఆన్‌లైన్ గేమ్‌ల్లో కోల్పోయారు. దీంతో ఒత్తిడికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించగా.. కుటుంబ సభ్యుల జాగ్రత్తతో ప్రాణాలతో బయటపడ్డారు. ఇవి కేవలం జిల్లాలో మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి



కేసులకు భయపడి..

ఆన్‌లైన్ ఆటల పుణ్యమా అని జిల్లాలో ఇలాంటి అఘాయిత్యాలు ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. డబ్బులు పోగొట్టుకున్న వారు కేసులకు భయపడి మిన్నకుండి పోతున్నారు. అప్పులు చేసి ఆడుతున్న వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మొదట రూ.10తో మొదలుపెట్టి రూ.లక్షల్లో అప్పులు చేస్తున్నారు. పోగొట్టుకున్న సొమ్ము రాబట్టుకోవడానికి రూ.వేలు, రూ.లక్షలు పెడుతున్నారు

సులువుగా డబ్బు సంపాదించాలనే..

సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలా మంది ఆన్‌లైన్ ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. మొదట సరదాగా కాలక్షేపం కోసం మొదలుపెట్టిన వారు కూడా చివరకు అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. జిల్లాలో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా విద్యార్థులు, యువకులు, మధ్య తరగతి వ్యక్తులు వీటితో నష్టపోతున్నారు. కొందరు తొందరగా తేరుకుని దూరమవుతుంటే.. చాలా మంది బయట పడలేక ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు..

అత్యాశకు వెళ్లి మోసపోవద్దు

ఆన్‌లైన్‌లో వివిధ రకాల మోసపూరిత ఆటలు ఉంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, యువత ఆలోచించాలి. అత్యాశకు వెళ్లి వాటికి బానిసలై ఆర్థికంగా నష్టపోవద్దు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. అలవాటు పడిన వారి గురించి సమాచారం ఇస్తే కౌన్సిలింగ్ ఇస్తాం. విద్యా సంస్థల్లో వీటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– అంబటి విజయ్‌కుమార్, సీఐ, టెక్కలి

ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా..

అంతర్జాలంలో ఇటువంటి ఆటలు చాలా ఉన్నాయి. తొలుత పెట్టిన డబ్బులకు రెట్టింపు వచ్చేలా చేస్తారు. రెండు, మూడు సార్లు ఇలా జరుగుతుంది. ఆ తర్వాత అసలు దందా మొదలవుతుంది. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా చరవాణితో ఆట సాగుతుంది. గెలిచిన మొత్తంలో 15 శాతం వరకు కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీ తీసుకుంటుంది.

తప్పుడు లొకేషన్ చూపిస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం వీటిలో కొన్నింటిని నిషేధించింది. అనుమతులున్న రాష్ట్రాల్లో ఉన్నట్లుగా లొకేషన్ చూపిస్తూ అక్రమంగా ఆట మొదలు పెడుతున్నారు. కొన్ని ఆటలకు పాన్‌కార్డు నంబరు, బ్యాంకు ఖాతా, మెయిల్ ఐడీ వంటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

ఇంట్లోకి చొరబడి నగలు చోరీ


బాధితురాలు కళావతి

పలాస, న్యూస్‌టుడే: పట్టపగలే ఇంట్లోకి చొరబడి నగలు దొంగిలించిన ఘటన పలాస పట్టణం సీతమ్మతల్లి మార్కెట్‌లో శనివారం చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా ఉంటున్న సాన కళావతి శనివారం మధ్యాహ్నం చెల్లెలు వరహాలమ్మతో కలిసి ఇంట్లో మాట్లాడుతున్న సమయంలో ఓ యువకుడు ఇంట్లోకి వచ్చి ఓ అడ్రస్ చెప్పాలని ఆమెను అడిగాడు. బాధితురాలు ఆ వ్యక్తిని ప్రశ్నించేలోపే ఆమె మెడలోని 110 గ్రాముల ఆభరణాలు లాక్కున్నాడు. పక్కనే ఉన్న వరహాలమ్మపై దాడికి యత్నించగా ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో దొంగ నగలతో పరారయ్యాడు. భోజనానికి ఇంటికి వచ్చిన భర్త శ్యామసుందరరావుతో బాధితురాలు జరిగిన విషయాన్ని చెప్పింది. అనంతరం వారు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.మోహనరావు తెలిపారు.

ఆదరణకు దూరమై.. ఆత్మహత్యకు సిద్ధమై..!


శిమ్మయ్యను రక్షించి తీసుకొస్తున్న వీఆర్వో అప్పలనాయుడు

నరసన్నపేట, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమై ఆ ముసలి ప్రాణం ఆత్మహత్యకు యత్నించింది. జన సంచారం లేని ప్రాంతంలో నదిలో దూకి కొట్టుకుపోతుండగా వీఆర్వో చూసి కాపాడారు. కోటబొమ్మాళి మండలం పట్టుపురం పంచాయతీ కిష్టుపురం గ్రామానికి చెందిన బొచ్చ శిమ్మయ్య ఆత్మహత్య చేసుకుందామని కోటబొమ్మాళి నుంచి మడపాం వద్ద ఆటో దిగిపోయి వంశధార నదిలో దూకాడు. ఆ సమయంలో వీఆర్వో అప్పలనాయుడు.. కొట్టుకుపోతున్న వృద్ధుడిని గుర్తించి రక్షించాడు. కోటబొమ్మాళి పోలీసుల ద్వారా శిమ్మయ్య కుటుంబీకులకు సమాచారం అందించగా, వారు వచ్చి తీసుకెళ్లారు.

తెదేపా నాయకుడి ఇంటిపై రాళ్ల దాడి


పగిలిన గాలి కృష్ణారావు ఇంటి కిటికీ అద్దం

పలాస, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు ఇంటిపై రాళ్లు విసరడంతో కిటికీ అద్దాలు ధ్వంసమవడం శనివారం కలకలం రేపింది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో కృష్ణారావు ఇంట్లో దుర్గాపూజ నిర్వహిస్తుండగా శాసనాం గ్రామానికి చెందిన కె.మన్మథరావు ఆయన్ను కలిసేందుకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానిక వార్డు కౌన్సిలర్ భర్త డి.శంకర్ ఇక్కడకు ఎందుకు వచ్చావంటూ మన్మథరావును ప్రశ్నించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. కృష్ణారావు సర్ది చెప్పటడానికి యత్నించగా..ఆయన్ను కూడా రేపటిలోగా నీ సంగతి చూస్తామంటూ కౌన్సిలర్ భర్త బెదిరించి వెళ్లిపోయాడు. శనివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో డి.సాయి, మరికొందరు కృష్ణారావు ఇంటిపై రాళ్లు విసిరారు. ద్విచక్రవాహనాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సీఐ మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం


శ్రీను (పాత చిత్రం)

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సంతబొమ్మాళి మండలం నరసాపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పొన్నాడ శ్రీను(27) వెల్డింగ్ కోర్సు పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇటీవల నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ భవనంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారం కారణమని తెలుస్తోంది. శ్రీను మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని సంతబొమ్మాళి ఇన్‌ఛార్జి ఎస్సై నారాయణస్వామి తెలిపారు.

రోలర్ స్కేటింగ్‌లో మెరిసిన జశ్విత



రోలర్ స్కేటింగ్‌లో జిల్లా క్రీడాకారిణి తెంబూరు జశ్విత అద్వితీయమైన ప్రదర్శనతో రాణించింది. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ ఆధ్వర్యంలో కాకినాడ వేదికగా గత మూడు రోజులుగా రాష్ట్రస్థాయి పోటీల్లో జశ్విత రజత పతకం సాధించింది. ఈమె శ్రీకాకుళం కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి చదువుతోంది. –న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ధాన్యం సేకరణ పారదర్శకంగా చేపట్టాలి


మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ 2024-25 గాను పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్‌లో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామని, స్థానికంగా వినియోగానికి గాను 1.04 లక్షల మెట్రిక్ టన్నులు అవసరంగా గుర్తించినట్లు తెలిపారు. దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. గ్రేడ్ ఏ రకానికి గానూ క్వింటాకు రూ.2320, 75 కిలోలకు రూ.1725 గా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్డీవోలు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, డీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

విశాఖపట్నం (మాధవధార), న్యూస్‌టుడే : విశాఖ మాధవధారలోని మాధవస్వామి ఆలయంలో ఆగస్టు నెలలో జరిగిన చోరీ కేసును కంచరపాలెం క్రైం పోలీసులు ఛేదించారు. ఆలయంలో చోరీకి పాల్పడ్డ నిందితులు ఎల్‌ఎన్‌పేటకు చెందిన వారిగా గుర్తించినట్లు క్రైం ఏడీసీపీ మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు కంచరపాలెం క్రైం పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైం ఏసీపీ వెంకట్రావు వివరాలు వెల్లడించారు. కేసుకు సంబంధించి శ్రీకాకుళం జిల్లా, కంచరపాలెం క్రైం పోలీసులు సంయుక్తంగా నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఎల్‌ఎన్‌పేటకు చెందిన సవర భోగేష్, సవర శివన్న, కూర్మన శ్రీనివాసరావుతో పాటు తెలంగాణకు చెందిన బత్తిన శ్రీకాంత్‌లను అరెస్టు చేసి 30 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసులో పట్టుబడ్డ నలుగురు నిందితులు ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 50కి పైగా ఆలయాల్లో భారీ చోరీలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

గార, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. గార మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకుని అవసరమైన సందర్భాల్లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం: 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

సమస్య : వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. పశువైద్య సబ్‌సెంటర్ నుంచి వైద్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసినా వైద్యాధికారిని నియమించలేదు.
–మార్పు రమణమూర్తి, స్థానికుడు

సమాధానం : గత పశువైద్యాధికారిణి బదిలీపై వెళ్లాక ఇక్కడ కొత్తగా నియామకం జరగలేదు. ఈవిషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన భవనం, వైద్యుని నియామకానికి కృషిచేస్తా.
- రాజ్‌కిరణ్, పశువైద్యాధికారి, గోవిందపురం
- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

? ఇచ్ఛాపురం పట్టణంలోని తారకేశ్వరవీధి కాలువలో మురుగు తొలగించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.
- ఎస్.రవికుమార్, ఇచ్ఛాపురం

● సమస్యను పరిష్కరిస్తాం.
- పి.ఉపేంద్రకుమార్, పుర ఎస్సై, ఇచ్ఛాపురం
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

భక్తిగీతాలాపన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ప్రముఖ గాయక సోదరులు ఎంకేరావు పట్నాయక్, వెంకటేశ్వర పట్నాయక్ (చిన్నాస్వామి) అమ్మవారి భక్తిగీతాలను ఆలపించి, భక్తులకు వీనులవిందు చేశారు. స్వేచ్ఛావతి దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఆలయంలో భక్తిరంజని కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గాయకులను భక్తులు సన్మానించారు.

శ్రీవారికి ఫలహారం



పలాస పట్టణం ఉలాసపేటలో వేంకటేశ్వరుడికి వివిధ రాకల పండ్ల దండలతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రధానాచార్యులు పి.శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.
– న్యూస్‌టుడే, పలాస

మంత్రి దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

కంచిలి, న్యూస్‌టుడే : మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి 1998 రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి.కామేష్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలను తీసుకెళ్లారు. ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు మంత్రిని శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వారికి తెలియజేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.పాపారావు, పి.సురేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి కామేష్‌రెడ్డి

బాబూరావుకు సత్కారం



బాబూరావును సత్కరిస్తున్న మెప్మా అధికారులు, ఆర్‌పీ, సీఎల్ఆర్‌పీలు

పలాస, న్యూస్‌టుడే: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావును శనివారం మెప్మా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఉద్యోగులు పలాసలోని బాబూరావు నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. తెదేపా నాయకులు పి.విఠల్, డి.శంకర్, మెప్మా సీఎంఎం మోహన్, సీవో బాలరాజు, సీఎల్ఆర్‌పీ, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ముంపు బారి నుంచి కాపాడండి

● ఏళ్లుగా బెల్లుపడ రైతుల వేడుకోలు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బెల్లుపడ గ్రామానికి నిర్మించాల్సి రక్షణ గోడ ఏర్పాటుకు అడుగులు పడటంలేదు. గత ప్రభుత్వ హయాంలో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించిన వారే లేకపోయారు. భారీ వర్షాలు వస్తే.. వరద నీటితో బెల్లుపడ గ్రామం మునిగిపోయే అవకాశం ఉంది. సాధారణ వర్షానికే పంట భూములు మునగడం పరిపాటిగా మారింది. 2018 తుపాను తర్వాత నుంచి ఎదుర్కొంటున్న కష్టం.. ఎప్పటికి దీనికి మోక్షం అంటూ బెల్లుపడ రైతులు, పెద్దలు అధికారులను ప్రశ్నించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమం వచ్చిన అధికారుల వద్ద వారి ఆవేదన వ్యక్తం చేశారు.



బాహుదా జలాల నుంచి రక్షణ కోసం గోడ నిర్మించాల్సిన ప్రాంతం

సమస్య ఏమిటంటే..

బాహుదానదీ జలాల ఆధారంగా సుమారు 1,800 ఎకరాల పంట భూమి సాగవుతోంది. బాహుదా జలాలు.. పాతాళేశ్వరాలయం సమీపంలో రాతికట్టు నుంచి ఈ ఛానల్‌లోకి చేరుతుంటుంది. అలా వచ్చిన నీరే సాగుకు ఉపయోగపడుతోంది. బెల్లుపడ మునకకు సంబంధించిన గోడ నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటు నీరు వృథా, అటు ముంపు తప్పడం లేదు. ఇంకా భారీ వర్షాలు అంటే తమకు కంటిమీద కునుకు ఉండట్లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాహుదానది కొత్త, పాత వంతెనల నడుమ ఉన్న ఉత్తరగట్టు 2018 తుపానుకు కొంత మేరకు కొట్టుకుపోయి ఆరేళ్లయినా గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో తమ సమస్య మరింత పెరుగుతోంది తప్పా, దాన్ని పరిష్కరించేవారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినుకుపడితే నీరు కదలదు.. తమ ప్రాంతం ఒకప్పుడు సుభిక్షంగా ఉండేది. బాహుదాజలాలు ఛానల్ ద్వారా అందుతుండటంతో బోరులే కుండానే సాగుచేసుకుంటున్నాం. హుద్‌హుద్ తుపానుకు తమ గ్రామానికి, పొలాలకు రక్షణగా బాహుదానదీ తీరంలో ఉండే గట్టు కొట్టుకుపోయింది. పొలాలేకాదు.. ఇళ్లు కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. – అనపాన తిరుపతిరెడ్డి, ఆదర్శరైతు, బెల్లుపడ

మరోసారి ప్రతిపాదనలు.. సమస్య పరిష్కారానికి ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపాం. ఈదుపురం, బెల్లుపడ ప్రాంతాల్లో నిర్మాణాలకు సుమారు రూ.2 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఈ మేరకు ఎమ్మెల్యే అశోక్‌కు వివరించాం. మరోసారి ప్రతిపాదనలు పంపిస్తాం.
– మధుసూదన పాణిగ్రహి, ఏఈ, జలవనరుల శాఖ, ఇచ్ఛాపురం

నేడు మెగా వైద్య, రక్తదాన శిబిరం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా యువనాయకుడు కంఠ్రెడ్ల నరేంద్ర రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కేశుపురంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలని నిర్వహిస్తున్నారు. గ్రామంలోని కొత్త సచివాలయ సమీపంలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు ఈ శిబిరాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులతో రోగులకు వైద్యపరీక్షలు జరిపి, అవసరమైన మందులను అందించడం జరుగుతుందని అన్నారు. ఉద్దానం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

రేపే విద్యుత్తు సరఫరా నిలిపివేత

పలాస, న్యూస్‌టుడే: చిన్నబడాం ఫీడర్ పరిధిలో మరమ్మతుల సందర్భంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస సబ్‌డివిజన్ ఏఈ జి.యగ్నేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం కాలనీ, పాత జాతీయ రహదారి, అంబుసోలి, తాళభద్ర, నీలావురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చిన్నబడాం, అంతరకుడ్డ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా అందుబాటులో ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా నేలబావి

కవిటి మండలం నెలవంక పంచాయతీ బైరెడ్లపుట్టుగలో రోడ్డు పక్కనే నేలబావి(నుయ్యి) ప్రమాదకరంగా ఉంది. గత పదేళ్లుగా ఆ బావిని గ్రామస్థులు వినియోగించకపోవడంతో వృథాగా ఉంది. ఆ నుయ్యి తక్కువ ఎత్తులో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసును ఈ విషయంపై వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



మురుగుతో దుర్వాసన



ఇచ్ఛాపురం పట్టణం కార్పేవీధి మండపం సమీపంలోని బోరవీధి వద్ద మురుగు కాలువ సమస్య తీవ్రంగా ఉంది. కాలువ శిథిలావస్థకు చేరిన పురపాలకులు పట్టించుకోవడం లేదని, వర్షం పడితే రోడ్డంతా మురుగు నీరు చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తూ, కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మలుపులో ముప్పు..

కంచిలి మండలంలోని సాలిన పుట్టుగ గ్రామం చివర శుద్ధజల ప్లాంటు మలుపు వద్ద రహదారిపై గుంత ఏర్పడటంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అది పెద్దదిగా మారడంతో గుంతను తప్పించే క్రమంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావు స్పందిస్తూ.. చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



దారంతా పొదలే..



మందస మండలం ఉగ్రవానిపేట నుంచి సరియాపల్లి వెళ్లే రహదారి ఇది. పొదలతో ఇరుకుగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దట్టంగా అల్లుకున్న పొదలు ఎలుగుబంట్లకు ఆవాసాలుగా మారాయని, చీకటి పడితే ఆ దారిలో రాకపోకలు చేయడం భయంగా ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని రహదారుల్లో పొదలు తొలగిస్తామని సర్పంచి బి.వెంకటరావు తెలిపారు.
–న్యూస్‌టుడే, హరిపురం (మందస)

చెత్తతో ఇక్కట్లు

కంచిలి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి పక్కన రోజుల తరబడి చెత్త పేరుకుపోతుండటంతో అక్కడ పందులు, కుక్కలు చేరి పరిసరాలను మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కార్యాలయాలకు రాకపోకలు సాగించేవారంతా దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈఓపీఆర్డీ రాంబాబు వివరణ కోరగా సిబ్బందిని పంచాయతీ కార్యదర్శులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.
–న్యూస్‌టుడే, కంచిలి



ఆదిశక్తి స్వరూపిణి అభయ ప్రదాయిని

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా అమ్మవారి పూజలు కొనసాగుతున్నాయి. శనివారం పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణల్లో దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
– న్యూస్‌టుడే బృందం



సోంపేటలో సరస్వతీదేవికి పూజలు



ఇచ్ఛాపురం: దక్షిణ కాళీమాత ఆలయం లో..



ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో భవానీమాలధారులు

అవీ..ఇవీ..అన్నీ

సమయానికి పూర్తి చేయాలి

కంచిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రాజెక్టు కార్యక్రమాలు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలంటూ వెలుగు ఏపీఎం ప్రసాదరావు తెలియజేశారు. వెలుగు సిబ్బందితో ఆయన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలానికి సీసీలుగా ఎస్.ధనలక్ష్మి, యు.రాణి, ప్రమీలదేవి విధుల్లో చేరినట్లు తెలిపారు.

ఇచ్ఛాపురంలో సంగీత కచేరీ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం ఇలవేల్పు స్వేచ్ఛావతి అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా బెంగళూరుకు చెందిన సంగీత విద్వాంసుడు పట్టాభిరామ పండిత్ గాత్రకచేరీ ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణలో ఈ కచేరీ జరగనుందని నిర్వాహక ప్రతినిధి తిప్పన ధనుంజయరెడ్డి పేర్కొన్నారు.

వేగ నియంత్రికల ఏర్పాటు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఫకీరుపేటలో లాలాపేట పుర ప్రాథమిక పాఠశాల విద్యార్థుల రక్షణ కోసం రోడ్డుపై వేగ నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నట్లు పుర ఉపాధ్యక్షురాలు ఉలాల భారతిదివ్య తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో సిమెంట్ రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో శనివారం ఆమె దగ్గరుండి పనులు పరిశీలించారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస ఎంపీడీవోగా కాళ్ల వసంత్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రమేష్‌నాయుడు బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో ఈయన వచ్చారు. ● ఇచ్ఛాపురం మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా కె.రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

అలరించిన గణిత దశావధానం

సోంపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సోంపేటలో నిర్వహించిన గణిత దశావధానం ఆకట్టుకుంది. వర్షత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పృచ్ఛకులుగా వ్యవహరించిన విద్యార్థులు వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావు క్షణాల్లో సమాధానమిచ్చి ఆకట్టుకున్నారు. ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్లు వి.సంతోష్, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

భారీ వాహనాలు రాకుండా చూడండి

పలాస గ్రామీణం: పలాస-కాశీబుగ్గ పురపాలకలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా చూడాలని పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ టీబీఆర్ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రసాదరావుకు జనసేన నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు.

రూ.10వేల ఆర్థిక సాయం

హరిపురం (మందస), న్యూస్‌టుడే : మందస మండలం నారాయణపురానికి చెందిన కిడ్నీ బాధితురాలు బత్తిన దమయంతికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు రూ.10 వేలు సాయాన్ని అందజేశారు. సమితి సభ్యులు కంచేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు



ఇచ్ఛాపురం పట్టణం నుంచి జాతీయరహదారికి చేరుకునేందుకు వినియోగిస్తున్న బందరోడ్డులోని కల్వర్టు సమస్యకు పురపాలక సంఘం, రహదారులు-భవనాల శాఖ అధికారులు సంయుక్తంగా పరిష్కార చర్యలు చేపట్టారు. గత నెలలో కాలువ పునరుద్ధరణ కోసం మూసి ఉన్న కాల్వర్టును తెరిచి, దానిపై బలహీన పలకలు అమర్చడంతో 'ఈనాడు'లో వచ్చిన సమస్య చిత్రంపై పుర సంఘ కమిషనర్ నల్లి రమేష్, ఏఈ కామేశ్వరరావులు ర.భ.శాఖ డీఈఈ ఎస్.రామినాయుడుతో సంప్రదించారు. ఆ మేరకు కల్వర్టుపై పలకలను పూర్తిగా తొలగించి, ఎప్పటిలానే రోడ్డులా మార్చివేసి తాత్కాలిక చర్యలు తీసుకున్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

స్పందనకు వందనం

దీపాలు వెలిగించారు



గత కొంత కాలంగా శాశాన వీధి, కంసాలవీధి ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా పురాధికారులకు దృష్టికి తీసుకెళ్లగా.. కమిషనర్ నల్లి రమేష్ స్పందించి, ఏఈ పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో సమస్యను పరిష్కరించారు. కొత్త దీపాలను అమర్చారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

చెత్త తొలగింపు

పురపాలక సంఘంలో టి.కె.ఆర్.కల్యాణ మండపం పక్క వీధిలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. రహదారిపైనే చెత్త పేరుతో గురువారం ఈనాడులో వచ్చిన సమస్య చిత్రంపై పారిశుద్ధ్య విభాగ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ స్పందించారు. పొక్లెయినర్‌తో రహదారిపై ఉన్న చెత్త, మట్టికుప్పలను తొలగించారు.
– న్యూస్‌టుడే, పలాస



అన్నాభిషేకం కోసం భిక్షాటన

షిర్డీసాయి పుణ్యతిథి ఉత్సవాల్లో భాగంగా అన్నాభిషేకం నిర్వహించేందుకు సాయిసేవకులు వీధుల్లో బియ్యం సేకరణ చేపట్టారు. రైల్వేకాలనీ షిర్డీసాయి ధ్యానమందిరంలో సేవకులు శనివారం కాశీబుగ్గ పట్టణంలో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జి.జె.ఎస్.రెడ్డి, కమిటీ సభ్యులు పి.లోకనాథం, రుషి, లీలారావు గుప్తా సాయిసేవకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస



కేజీబీవీ విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన



ఇటీవల జరిగిన ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన కవిటి కేజీబీవీ పదో తరగతి విద్యార్థిని పి.అలకనందను ఎమ్మెల్యే అశోక్ శనివారం అభినందించారు. విద్యార్థిని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచి మధుబాబు తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

అమ్మవారి హుండీ చోరీ

పలాస: పలాస లేబర్ కాలనీల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి హుండీ చోరీకి గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక జ్యోతుల సిద్ధూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భవానీ మాలధారులు శుక్రవారం రాత్రి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో అగంతకులు హుండీను ఎత్తుకెళ్లి సమీప పొదల్లో పడేశారు. భక్తులు సమర్పించిన కానుకలు సుమారు రూ.70వేల వరకు ఉండొచ్చని నిర్వాహకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని శనివారం కాశీబుగ్గ సీఐ మోహన్‌రావు పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో శిక్షణ తరగతులు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.ఎస్.పల్లి ఆదర్శపాఠశాల ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు.

కొనసాగుతున్న చెరువు అభివృద్ధి పనులు

కంచిలి గ్రామీణం: మండలంలోని మకరాంపురంలో లింగాల చెరువు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం సర్పంచి ప్రతినిధి శోభన్ బాబు చెరువు చుట్టూ మొక్కలు నాటి, కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు.

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

క్రీడలతో ఆరోగ్యం

నరసన్నపేట, న్యూస్‌టుడే: క్రీడలతో యువత ఆరోగ్యం ఉంటారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం సత్యసాయి సేవా సమితుల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మంత్రి దృష్టికి సమస్యలు

కోటబొమ్మాళి మండల రీసోర్సు కార్యాలయ భవనం, భవననిర్మాణానికి నిధులు, ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడికి దృష్టికి ఎంఈవోలు, ఉపాధ్యాయసంఘ నేతలు, ఎంఆర్సీ సిబ్బంది తీసుకెళ్లారు. గత ప్రభుత్వం సమయంలో 22రోజుల సమ్మెకాలానికి జీతాలు, ప్రస్తుతం రెండునెలల జీతాల సమస్యలను ప్రస్తావించారు. - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

ప్రశ్న: నందిగాం మండలం సైలాడ పంచాయతీ దొడ్డరామచంద్రాపురం గ్రామంలో 5 వీధి దీపాలు వెలగడం లేదు. **- నాగరాజు, దొడ్డ రామచంద్రాపురం.**

సమాధానం: చర్యలు తీసుకుంటాం **- సీహెచ్ రవి, పంచాయతీ కార్యదర్శి, సైలాడ.** - న్యూస్‌టుడే, నందిగాం

? టెక్కలిలోని విద్యానగర్ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. **- స్థానికులు, విద్యానగర్ కాలనీ**

● త్వరితగతిన మరమ్మతులు చేయిస్తాం. **- జగన్నాథరావు,పంచాయతీ కార్యదర్శి, టెక్కలి** - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

వంతెన పరిశీలన

స్పందనకు వందనం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం బాడాం వద్ద జలుమూరు కాలువపై నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంపై 'బయట పడిన ఇనుప చువ్వలు' పేరిట శుక్రవారం ఈనాడులో కథనానికి ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించారు. వంతెన పరిశీలించి, పూర్తిగా శిథిలమైందని గుర్తించారు. కొత్తగా నిర్మించేందుకు రూ.2లక్షలు అవసరమని అంచనా వేశారు. ఆమోదం పొందిన వెంటనే త్వరితగతను పనులు పూర్తి చేస్తామని పీఐయూ డీఈఈఈ ఎస్.వెంకటరావు తెలిపారు.

మీ ఇంటికి మాది భరోసా

- పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా అడుగులు
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం

జలుమూరు, నరసన్నపేట, న్యూస్‌టుడే

పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన లే-అవుట్‌లు, స్వంత స్థలాల్లో ఇల్లు మంజూరు చేసింది వాటిలో చాలా వరకు వివిధ దశల్లో ఆపేసిన నిర్మాణ పనులను మళ్లీ పట్టాలెక్కించి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు శ్రీకారం చుట్టింది. 'మన ఇల్లు - మన గౌరవం' పేరుతో గృహనిర్మాణ సంస్థ అధికారులు, మండలస్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఇళ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తిచేయాలని బిల్లులు చెల్లిస్తామని అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇల్లు నిర్మాణాలు సైతం పూర్తి చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారు.



నరసన్నపేట మేజరు పంచాయతీలో 'మన ఇల్లు-మన గౌరవం' సమావేశంలో పాల్గొన్న అధికారులు



కరకవలస వద్ద ఇల్లు నిర్మాణం పూర్తిచేయాలని సూచిస్తున్న ఎంపీడీవో అప్పలనాయుడు, ఉద్యోగులు

మండలం	పునాదిదశలో ఉన్నవి	స్లాబ్ స్థాయిలో ఉన్నవి	స్లాబ్‌లు పూర్తయినవి
జలుమూరు	97	78	113
నరసన్నపేట	546	124	139
సారవకోట	43	33	57
పోలాకి	178	72	97

త్వరితగతిన నిర్మాణం జరిగేలా చర్యలు.. లబ్ధిదారులకు మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని అవగాహన కల్పిస్తున్నాం. మార్చి నాటికి పూర్తి చేయని పక్షంలో రద్దు చేయబడతాయి. ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు చర్యలు చేపడుతుంది. సిమెంట్, ఇనుము మా వద్ద సిద్ధంగా ఉన్నాయి. పనులు ప్రారంభించి లబ్ధిదారులకు అందిస్తాం. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. - కె.అప్పారావు, డీఈ గృహనిర్మాణ సంస్థ

శతశాతం లక్ష్యం

గత తెదేపా ప్రభుత్వం 2018-19లో ఇల్లు మంజూరు చేసింది. అప్పట్లో కొందరి లబ్ధిదారుల ఖాతాలో ఒక్క రూపాయి జమ అయింది. మరి కొందరికి మొదటి విడత కొంత డబ్బు జమ అయింది. ఇంతలో ఎన్నికలు వచ్చి వైకాపా అధికారంలోకి వచ్చింది. అప్పటి లబ్ధిదారులకు ఐదేళ్లపాటు ఒక్క రూపాయి చెల్లించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారం చేపడితే ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు చెల్లించరని ఎన్నికల ముందు వైకాపా శ్రేణులు జగనన్న కాలనీల్లో ప్రచారాలు చేశారు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అర్హత ఉండి గడువులోగా ఇల్లు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

క్షేత్రపర్యటనలతో మేధో వికాసం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: క్షేత్రపర్యటనలతో విద్యార్థుల్లో మేధాశక్తి వికసిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ అన్నారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీఎస్సీ తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ విద్యార్థులకు శనివారం క్షేత్రపర్యటన నిర్వహించారు. లింగాలవలసలోని చేపల చెరువుల్ని సందర్శించిన విద్యార్థులకు పెంపకం విధానం, మొళకువలపై అవగాహన కల్పించారు. అదే విధంగా జన్యువిభాగ కౌన్సిలింగ్‌లో భాగంగా జన్యు రుగ్మతలతో కూడిన బాధితురాలి సమాచారాన్ని సేకరించి జెనెటిక్ నివేదికను తయారు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లూక్ పాల్ పాల్గొన్నారు.



క్షేత్రపర్యటనలో విద్యార్థుల బృందం

బాధ్యతల స్వీకరణ

హిరమండలం, నరసన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలువురు అధికారులు, ఉద్యోగులకు బదిలీ కాగా వారి స్థానంలో కొత్తవారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దారుగా నందిగాం హనుమంతురావు, డీటీగా బాలకృష్ణ, రీసర్వే డీటీగా నీలిమ, మండల సర్వేయర్‌గా ఎన్‌వీ రమణయ్య, మండల పరిషత్ కార్యాలయం ఏవోగా శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీగా గోవిందరావు, ఏపీఎంగా పైడి కూర్మారావులు బాధ్యతలు స్వీకరించారు. ● నరసన్నపేట ఎస్సైజ్ సీఐగా ఎస్‌వీ రమణమూర్తి, ఎస్సైగా గురుమూర్తి బాధ్యతలు చేపట్టారు. అలాగే ర.భ శాఖ శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గృహనిర్మాణ సంస్థ ఏఈగా ఉరిటి రాజేంద్రప్రసాద్ బదిలీపై వచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కనకేశ్వరరావు నియమితులయ్యారు. ఈవోపీఆర్‌డీగా రేణుకాదేవి, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా బసవేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు.

టెట్‌కు 74 మంది గైర్హాజరు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 74 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 292 మంది, మధ్యాహ్నం 294 మంది హాజరయ్యారని ఎంఈవో దాలినాయుడు తెలిపారు.

ఉచిత ఇసుక అందించాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం తక్షణమే హామీని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిర్ల ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రమైన కొత్తూరులో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు వలసబాట పట్టారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

8న నరసన్నపేటలో ఉద్యోగ మేళా

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఈ నెల 8న నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ లత తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో 5 సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న వారు ఆధార్‌తోపాటు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

బురద.. బురద



నందిగాం మండలం కవిటి అగ్రహారం గ్రామ సచివాలయానికి ఎదురుగా ఉన్న కచ్చా రహదారిపై వాన పడితే నీరు గుంతల్లో చేరి బురదమయంగా ఏర్పడుతోంది. దీంతో సచివాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా గ్రామానికి నడిచి వెళ్లే వారు బురదలో జారిపడుతున్నారు. గోతుల్లో కంకర వేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రమణబాబు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, నందిగాం

ఎప్పుడు పూర్తి చేస్తారో.....?



పోలాకి మండల పరిధిలోని పల్లిపేట గ్రామంలో 11 ఏళ్ల కిందట చేపట్టిన పాఠశాల భవన నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. ఈ భవన నిర్మాణానికి సమగ్రశిక్షా నుంచి రూ.11 లక్షలు మంజూరయ్యాయి. తొలినాళ్లలో పని జోరుగా సాగినా తరువాత గుత్తేదారు వదిలేశారు. పాత భవనం శిథిలమవడంతో అసంపూర్తి భవనంలోనే చదువులు కొనసాగిస్తున్నారు. సమగ్ర శిక్షా ఏఈ రమానంద్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా పనులు చేసిన మేర చెల్లింపులు జరిగాయన్నారు. భవనం పూర్తి చేసేందుకు ఇటీవల మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు చేశామన్నారు. నిధులు మంజూరు కాగానే పూర్తి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, పోలాకి

గతుకులు.. అవస్థలు..



స్థానిక సర్వమంగళవీధి ప్రధాన సిమెంట్ రహదారి ధ్వంసమవుతోంది. సిమెంట్ ఊడి రాళ్ల పిక్కలు కనిపించడంతోపాటు చిన్న చిన్న గతుకులు ఏర్పడి నీరు నిలిచిపోతున్నాయి. చిన్నబజారు కూడలి నుంచి సరస్వతి పార్కు వరకు ఈ సమస్య ఉంది. రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై మండల ఇంజినీరింగ్ అధికారి లక్ష్మునాయుడు మాట్లాడుతూ తక్షణమే ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ఉపాధి పథక నిధులతో నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ఇరుకు వంతెనతో ఇబ్బందులు

నందిగాం మండలం గొల్లవూరు-రాంపురం బీటీ రహదారిపై గొల్లవూరు సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో వంతెన నిర్మించారు. ఈ వంతెన 2022 జూన్‌లో కూలిపోయింది. ఆ తరువాత తాత్కాలికంగా ఇనుము వంతెన నిర్మించారు. ఇరుకుగా ఉండటంతో నాలుగు చక్రాల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాలువలో నీరు తగ్గిన వెంటనే వంతెన నిర్మిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ సతీష్ పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, నందిగాం



సాగునీరు వృథా



పోలాకి మండల పరిధిలోని పల్లిపేట గ్రామం రైతులకు సాగు నీరు అందించాల్సిన వంశధార కాలువలకు ఉన్న షట్టర్లు దెబ్బతినడంతో నీరు వృథాపోతోంది. ఈ కాలువపై ఆధారపడి 75 ఎకరాలు ఉన్నాయి. సుమారు మూడేళ్లుగా పరిస్థితి ఇలానే ఉన్నా సమస్య పరిష్కారం కావడం లేదని కావడం లేదు. ఈ విషయమై ఏఈ శ్యామలరావు మాట్లాడుతూ షట్టర్లకు సంబంధించి న్యాయస్థానంలో కేసు ఉన్నందున కొత్తగా ఎక్కడా షట్టర్లు ఏర్పాటు చేయలేమన్నారు. - న్యూస్‌టుడే, పోలాకి

అమ్మవు నీవే అఖిల జగానికి..!



నరసన్నపేట గ్రామీణం: ఉర్లాంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో..



పాతపట్నం: నృత్యం చేస్తున్న బృంద సభ్యులు



శ్రీముఖలింగంలో పూజలందుకుంటున్న మూడు ముఖాల తల్లి..



నందిగాం: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో..

దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు అమ్మవారి అవతారాలను దర్శించుకుని పరవశించిపోతున్నారు. ప్రత్యేక సామూహిక పూజలు, పారాయణాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. - న్యూస్‌టుడే, బృందం



టెక్కలి పట్టణం: చిన్నబజారులోని మహిళల సామూహిక పూజలు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలి విద్యార్థులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్ క్రీడావికాసకేంద్రంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు నర్సిపురం శేఖర్ తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో చిత్తూరు జిల్లా తిరుపతిలో జరగనున్న పోటీల్లో 14ఏళ్ల వయో విభాగంలో మెండ తపస్వి, నెమలిపురి ప్రత్యూష, 17ఏళ్ల వయోవిభాగంలో పులిబంద జాస్విక, కూన ధరణి, బాలుర విభాగంలో మోహిత్, మనీష్ పాల్గొననున్నారని చెప్పారు.



ఎంపికైన క్రీడాకారులతో శిక్షకుడు

కేంద్రమంత్రిని కలిసిన కోలాట బృందం

తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నరసన్నపేటకు చెందిన మహిళా కోలాట బృందం సందడి చేసింది. బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా కోలాట బృందం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలుసుకున్నారు. ఆయనతో కాసేపు ముచ్చటించిన మహిళా కోలాట బృందం తాము శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట



విద్యార్థులకు దుస్తుల పంపిణీ

అనాథలైన విద్యార్థులకు వారధి ప్రాజెక్టు ద్వారా దత్తత తీసుకుని ఆసరా కల్పిస్తోంది స్వామిబాబు వజ్రమ్మ ఛారిటబుల్ ట్రస్టు. శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న తల్లిదండ్రులు లేని 30 మంది విద్యార్థులకు దుస్తులు, ఇతర వస్తువులు అందజేసింది. - న్యూస్‌టుడే, నరసన్నపేట



ఒక గది.. రెండు తరగతులు

వేరే పనులకు వినియోగించడంతో విద్యార్థులకు ఇబ్బందులు



కోటబొమ్మాళి బాలుర ఉన్నత పాఠశాలలో తరగతి గదిలో నిల్వ చేసిన పుస్తకాలు

న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటబొమ్మాళి బాలుర ఉన్నతపాఠశాలలో నాబార్డు నిధులు రు.1.10 కోట్లతో అదనపు తరగతులు, బాలికలకు అవసరమైన మరుగుదొడ్లు నిర్మించారు. అందులో ఓ గదిని మండల విద్యాశాఖకు చెందిన పుస్తకాలు, ఇతర మెటీరియల్ బస్తాలు ఉంచారు. దీంతో విద్యార్థుల రెండు గదులు చాలడం లేదు. ప్రకాష్‌నగర్‌కాలనీ సమీపంలోని ఉన్నత ప్రాథమికపాఠశాలలో సుమారు 64 మంది బాలాబాలికలు ఉన్నారు. రు.16 లక్షలతో మరుగుదొడ్లు, తాగునీటిబోరు, పెయింటింగు పనులు చేశారు. ఒక తరగది గదిలో పుస్తకాలు పెట్టి గదికి తాళం వేశారు. ఫలితంగా ఒకేగదిలో రెండేసి తరగతులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది.

కొద్దిరోజుల్లో పరిష్కారం

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. మెటీరియల్ పంపిణీ చేయకుండా ఎందుకు ఉంచేశారో తెలుసుకుంటాను. - గోవిందరావు, ఎంఈవో, కోటబొమ్మాళి



ప్రకాష్‌నగర్‌కాలనీ సమీపంలోని ప్రాథమిక పాఠశాల గదికి తాళం

వ్యక్తిత్వ వికాస శిక్షణకు స్పందన

సారవకోట, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విజయనగరం విభాగ్ ఆధ్వర్యంలో సారవకోట సమీకృత వసతిగృహంలో వ్యక్తిత్వ వికాసంపై ప్రారంభమైన శిక్షణ కార్యక్రమానికి స్పందన లభించింది. 14 సంవత్సరాల వయసు పైబడిన వారు 135మంది పేర్లు నమోదు చేసుకోవడంతో 15మంది శిక్షకులు యోగ, దండ వ్యాయామంపై శనివారం శిక్షణ ఇచ్చారు.



దండ వ్యాయామంపై శిక్షణ పొందుతున్న బాలురు

రెండేళ్ల కాల పరిమితితో మద్యం దుకాణాలకు అనుమతులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణాల అనుమతులకు ఈ నెల 9లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. రెండేళ్ల కాలపరిమితితో అనుమతిస్తున్నట్లు అబ్కారీ సీఐ రమణమూర్తి, ఎస్సై గురుమూర్తి తెలిపారు. మద్యం దుకాణానికి తొలి ఏడాది రూ.65లక్షలు, రెండో సంవత్సరం రూ.71.5 లక్షలు అనుమతి రుస్తుం చెల్లించడంతోపాటు దరఖాస్తుకు రూ.2 లక్షల చెల్లించాలన్నారు.

పెద్దసీదిలో ఉచిత వైద్య శిబిరం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం పెద్దసీది జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మెగా వైద్య శిబిరం జరిగింది. ఆజాద్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. సీది, గంగుపేట, తీమర, తామర గ్రామాలతో పాటు సమీప గ్రామాలకు చెందిన వారు ఉచిత వైద్య సేవలను పొందారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

షిర్డీ గిరిపై పూజలు ... పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నంలోని షిర్డీ గిరిని తెలంగాణ సచివాలయ సహాయక కార్యదర్శి కోటేశ్వరరావు సందర్శించి పూజలు చేశారు. మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామానికి ఆయన తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా శాంతి... సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా అన్నుపురం గ్రామానికి చెందిన తాడేల శాంతి శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీఎం పి.శ్రీనివాస్ బాబా ఈ విషయాన్ని తెలియజేశారు.

నీరు కదలదు.. సమస్య తీరదు

జలుమూరు మండలం అంధవరం పంచాయతీ రామకృష్ణాపురం కాలనీలో మురుగు కాలువలు లేక వర్షం నీటితోపాటు, వీధి కుళాయిల నుంచి వచ్చిన నీరు రహదారిపైనే రోజుల తరబడి నిలిచిపోతోంది. అధికారులు స్పందించి వీధిలో ఇరువైపుల కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ జేఈ కె.శ్రీధర్ వద్ద ప్రస్తావించగా సీసీ రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదించామని నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, జలుమూరు



ముగిసిన స్వర్ణాంధ్ర కార్యశాల

నరసన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 కార్యశాల శనివారంతో ముగిసింది. గత నెల 21న ఈ కార్యశాల ప్రారంభించి విద్యార్థుల్లో అవగాహన, క్విజ్, వ్యాస రచన తదితర పోటీలు, సదస్సులు జరిగాయి.

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించ వచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

తెరపై ఈనాడు

★ కిరణ్: రామనగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): దక్షిణ ★ సూర్యమహల్: స్వాగ్ ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: మత్తువదలరా-2 ★ మారుతి: చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

కేంద్రం ఆవరణలో న్యూట్రీ గార్డెన్ తప్పనిసరి

గార, న్యూస్‌టుడే: ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో న్యూట్రీ గార్డెన్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. గార మండలం బోరవానిపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ఆవరణలోని న్యూట్రీ గార్డెన్‌ను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీవో డి.రాధామాధవి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

హోంగార్డు కుటుంబానికి చేయూత

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం యూనిట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన జి.సురేష్ సతీమణి దుర్గాభవానీకు ఎస్పీ మహేశ్వరరెడ్డి శనివారం చెక్కు అందజేశారు. జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులంతా తమ ఒకరోజు వేతనం సుమారు రూ.4.29 లక్షల నగదు బాధిత కుటుంబానికి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, ఏవో గోపీనాథ్, ఆర్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.



సురేష్ భార్యకు చెక్కు అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నవరస భరితం.. హరికథా గానం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం విజయనగరానికి చెందిన కాళ్ల నిర్మల హరికథాగానం జరిగింది. ఆమె పలు అంశాలను నవరసభరితంగా గానం చేసి ఆకట్టుకున్నారు. తొలుత పేద కళాకారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పులఖండం శ్రీనివాసరావు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత గజల్ వాసుదేవాచారి, న్యాయవాది కూన రాజారావు అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల డాక్టరేట్ పొందిన రంగస్థల నటుడు ఎల్.రామలింగస్వామిని సత్కరించారు. సమాఖ్య ప్రతినిధులు పన్నాల నరసింహమూర్తి, చిట్టివెంకటరావు, రామచంద్రదేవ్, రమణరావు, సత్యవతి, గణేష్, హరిసత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథరావు అన్నారు. శనివారం మండలంలోని దూసి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించిన పీఎం కిసాన్ 18వ విడత నగదు విడుదల లైవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతాయని అన్నారు. ఏడీఏ రజనీ, ఏవో మెట్ట మోహనరావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దూసి రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న జేడీ త్రినాథరావు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం-బాతువ రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఏఎస్సై సీహెచ్.చక్రధరరావు తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాతువ గ్రామ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. అతడికి 60 ఏళ్లు ఉంటాయి. గెడ్డంతో ఉన్నాడు. కాషాయ రంగు చొక్కా, కాకి రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో బొద్దాం నుంచి చీపురుపల్లికి వెళ్లిన ఆర్టీసీ బస్సు టిక్కెట్ 3వ తేదీతో ఉంది. రైలు నుంచి 4వ తేదీ రాత్రి జారి పడి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో భద్రపరిచినట్లు, పూర్తి వివరాలకు 94934 74582 నంబరుకు సంప్రదించాలని శ్రీకాకుళం రైల్వే ఏఎస్సై తెలిపారు.

నత్తనడకన నాలుగేళ్లుగా..!

కొలిక్కిరాని విద్యుత్తు దహన సంస్కార వాటిక పనులు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం నగరంలో నాలుగేళ్ల కిందట ప్రారంభించిన విద్యుత్తు దహన సంస్కార వాటిక పనులు ఇంకా కొలిక్కిరాలేదు. 95 శాతం మేర పూర్తయినా త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారుల అలసత్వం ప్రదర్శిస్తుండటంతో జాప్యం కొనసాగుతోంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడం.. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం పనుల పాలిట శాపంగా మారింది.

కొవిడ్ రెండో దశ సమయంలో కరోనా మృతుల దహన సంస్కారాలు నిర్వహించడం అప్పట్లో అధికారులకు పెద్ద సవాలుగా మారింది. పెద్ద ఎత్తున ఆరుబయటే.. నాగావళి ఒడ్డున చేపట్టేవారు. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ జె.నివాస్ శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైటు కూడలి వద్ద విద్యుత్తు దహన సంస్కార వాటిక నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.47 కోట్లతో నగరపాలక సంస్థ పనులు ప్రారంభించింది. మొదటి విడతలో భవనాలు, ప్రహరీ నిర్మాణం, విద్యుత్తు సౌకర్యం వంటి పనులు పూర్తి చేశారు. వాటికి సంబంధించి గుత్తేదారుకు బిల్లులు సైతం చెల్లించేశారు. ఆ తర్వాత కొంతకాలం పనులు నిలిచిపోయాయి. ఏడాది కిందట పునఃప్రారంభమయ్యాయి. అప్పుడు రెండో విడతలో భాగంగా రూ.85 లక్షలతో విద్యుత్తు దహన సంస్కార యంత్రాలను ఏర్పాటు చేశారు. విద్యుత్తు, జనరేటర్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు.

మిగిలింది 5 శాతమే..

ఇంకా గ్యాస్ సౌకర్యం వంటి 5 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి పూర్తి చేసి.. దహన సంస్కార వాటిక నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించట్లేదు. ఇప్పటికే మూడేళ్ల కిందట నిర్మాణం పూర్తయిన భవనాలను ఉపయోగించకుండా నిరుపయోగంగా వదిలేయడం, అప్పట్లో చేసిన నాసిరకం పనులతో పలు చోట్ల గోడలు బీటలు వారాయి. చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. పనుల ప్రారంభం సమయంలో నగర పాలక సంస్థలో డీఈగా ఉన్న వ్యక్తి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లి. మళ్లీ ఈఈగా ఈఈగా శ్రీకాకుళం నగరపాలక సంస్థకే వస్తున్నా ఇది మాత్రం ప్రజలకు అందుబాటులోకి రాలేదు.



పనికిరాని మొక్కల మధ్య నిరుపయోగంగా నిర్మాణం

వీలైనంత త్వరగా పూర్తి..

ఈ విషయమై శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి దహన సంస్కార వాటికను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

మానసిక రోగులతో ప్రేమగా వ్యవహరించండి



ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవి వెంకటాచలంతో మానసిక విభాగ వైద్యులు

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మానసిక రోగులతో ప్రేమగా వ్యవహరించి వారిని ఆరోగ్యవంతులను చేయాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవివెంకటాచలం పేర్కొన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా శనివారం సర్వజనాసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానసిక విభాగం అధిపతి పద్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డి.విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బి.సాయిరాం, టి.అఖిల, ఎన్.బిందుమాధవి, వైద్యులు ఎం.గోపీచంద్, సీహెచ్.కృష్ణదీపక్, శివం పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు పట్టణానికి చెందిన అల్లంశెట్టి శ్రీవికాస్ కళాంజలి థియేటర్ సమీపంలో నూతనంగా దుకాణం ప్రారంభించే తరుణంలో ఇక్కడ పనిచేసే వెల్డింగ్ కార్మికుడు పడగ నానితో వాగ్వాదం చోటు చేసుకుంది. వైకాపా మహిళా అధ్యక్షురాలు కూన రమణమ్మ వచ్చి శ్రీవికాస్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొందూరు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వన్యప్రాణులపై సహృదయంతో మెలగాలి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల పట్ల సహృదయంతో మెలగాలని జిల్లా అటవీశాఖ శాఖ అధికారి యాళ్ల సంజయ్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాము కాటు నివారణ, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి నిహారిక, సెక్షన్ అధికారి జగదీష్, గ్రీన్‌మెర్సీ సీఈవో రమణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖ అధికారి సంజయ్

శిథిలావస్థలో భవనం



సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని శిథిలమైన పెంకుల భవనంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలతో పూర్తిగా గోడలు తడిసి ముద్దవ్వడం వల్ల ఏ క్షణంలో కూలుతుందోనని వాపోతున్నారు. అధికారులు స్పందించి దీన్ని కూలదోయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో శ్రీనివాసరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

రహదారిపై మురుగు

శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీ 8, 10వ లైన్‌లో సీసీ కాలువల్లేక వాడుకనీరు రహదారులపై నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని నీరు నిలిచిపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



ఉచిత ఇసుక అందరికీ అందేలా చూడండి

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం అందరికీ ఉచిత ఇసుక అందేలా చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. మండలంలోని రామతీర్థాల కూడలి వద్ద శనివారం కార్మికులు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు వెలమల రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక అందించడం వల్ల ఉపాధి అవకాశాలు పెరిగి భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇజ్జురోతు రమణ, పి.చిన్న, పి.రామకృష్ణ, జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటకు లైన్‌మేన్‌ను నియమించాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోట గ్రామానికి విద్యుత్తు లైన్‌మేన్‌ను నియమించాలని స్థానిక సర్పంచి సురవరపు జగదీశ్వరరావు కోరారు. గ్రామంలో విద్యుత్తు సమస్య ఏర్పడితే రోజుల తరబడి పరిష్కారానికి ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. వీధి దీపాలు వేయిద్దామని బల్బులు తీసుకువచ్చి నెల రోజులవుతున్నా స్తంభం ఎక్కి బల్బువేసే నాథుడే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నట్లు పేర్కొన్నారు. కొత్తకోట సచివాలయానికి లైన్‌మేన్‌ను నియమించాలని కోరారు.

అవీ..ఇవీ..అన్నీ



గురుబ్రహ్మ అవార్డుకు కరిమి ఎంపిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఎడ్యుకేషన్ స్పెషల్, గోదావరి టాలెంట్ టెస్ట్ అకాడమీ సంయుక్తంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికైన జిల్లాకు చెందిన కరిమి రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈయన 2021లో రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు.

మహిళా హోంగార్డులకు చీరలు పంపిణీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: అమ్మవారి నవరాత్రి వేడుకలు శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రధానార్చకులు సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఓ వస్త్రాల దుకాణ యజమాని జిల్లాలో పనిచేస్తున్న మహిళా హోంగార్డులకు శనివారం చీరలు పంపిణీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి 91 మందికి అమ్మవారి చిత్రపటం, చీరలు అందించారు.

పురుషోత్తపురంలో సత్సంగం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో శనివారం సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి విగ్రహం వద్ద భక్తులు వివిధ పూజలు నిర్వహించారు. వేదపండితులు బంకుపల్లి వెంకట సత్యగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అఖిల భారత విశ్వహిందూ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీ భక్తులు, తదితరులు పాల్గొని పూజలు చేశారు.

చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: చేపల పెంపకంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని అనకాపల్లి పరిశోధనా స్థానం సంచాలకులు డా.సీహెచ్ ముకుందరావు అన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రంలో చేపల పెంపకంపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.కె.భాగ్యలక్ష్మి, డా.సీహెచ్.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తమ్మినేనికి అభినందనలు


ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసు తనయుడు కృష్ణచైతన్య శనివారం వైకాపా శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాంను కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు వైకాపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శివశంకర్‌ను కలిసిన పేడాడ

ఆమదాలవలస గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన తమ్మిరెడ్డి శివశంకర్‌ను శనివారం ఆమదాలవలస నియోజకవర్గ జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖలోని ఆయన కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఆయనతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టరుగా ఆనెపు ప్రమాణ స్వీకారం

బూర్జ, న్యూస్‌టుడే: విజయవాడలోని మార్క్‌ఫెడ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మార్క్‌ఫెడ్ ఎండీ జిలానీ సామూన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మిగిలిన సభ్యులతో బూర్జ మండలం జడ్పీటీసీ మాజీ సభ్యులు, పెద్దపేటకు చెందిన ఆనెపు రామకృష్ణ నాయుడు డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించి ప్రమాణస్వీకారం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.



కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కీలకభూమిక పోషించనుందని, గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు అభిమానులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. రణస్థలంలో శనివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన కరిమజ్జి మల్లేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి పలువురు నాయకులతో పార్టీ పరిస్థితులపై చర్చించారు. నాయకులు దేవరాపల్లి, ఆబోతుల వెంకటనాయుడు, ఐ.రమణ, కె.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం ఆధారంగా సాగు విధానం మారాలి

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: విచక్షణా రహితమైన మానవ కార్యకలాపాల వల్ల భూతాపం పెరగడంతో వాతావరణంలో పలు మార్పులు సంభవిస్తున్నాయని, వీటికి అనుగుణంగా సాగు విధానం మారాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రణస్థలంలో బెంగళూరుకు చెందిన క్లైమ్స్, ఈక్విలిబ్రియం, వెర్రా సంస్థలు సంయుక్తంగా స్థానిక రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో శనివారం భాగస్వామ్యం సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. విజయనగరం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.లక్ష్మణ్, సస్యపోషణ శాస్త్రవేత్త ఎం.ఎం.వి.శ్రీనివాసరావులు మాట్లాడారు. వాతావరణ, పర్యావరణ కార్యాచరణ ప్రతినిధి ఆర్.హరిబాబు, అభ్యుదయ రైతులు కండాపు ప్రసాదరావు, కలిశెట్టి ఆదినారాయణ, ఇప్పిలి రామ్మోహన్‌రావులతో పాటు రెండు జిల్లాకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు

కాలువల నిర్మాణానికి రూ.7.55 కోట్లు మంజూరు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో కాలువల్లో పూడికతీత పనులతో పాటు నూతనంగా సీసీ రహదారులకు ఇరువైపులా కాలువల ఏర్పాటుకు 7.55 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 79 పనులకు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కేశవరావుపేటలో రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్రంలో పాత జిల్లాల ప్రాతిపదికగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు శనివారం సాయంత్రానికి ఇక్కడికి చేరుకున్నారు. పోటీల ఏర్పాట్లను ఎం.వి.రమణ, బి.వి.రమణ, ఎం.సాంబమూర్తి, ప్రధానోపాధ్యాయుడు బి.వి.సాయిరాం పర్యవేక్షిస్తున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన జరిగింది. డిగ్రీ కళాశాల ఏర్పాటుపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి స్థానిక ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులు తీసుకెళ్లడంతో ఆయన స్పందించి కళాశాల ఏర్పాటుకు నివేదికను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఈశ్వరరావు, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు సురేఖలు శనివారం కొండములగాం జూనియర్ కళాశాల, దానికి ఆనుకొని ఉన్న స్థలాన్ని పరిశీలించారు.

శివశంకరీ.. జగజ్జననీ..!

శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంటపాల్లో, దేవాలయాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసి కుంకుమ, ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారిని వివిధ స్తోత్రాలతో స్తుతించారు. – న్యూస్‌టుడే బృందం



భవానీనగర్-డీసీసీబీ కాలనీలో..



కత్తెరవీధి రాజరాజేశ్వరీ పీఠంలో..



బలగ కాల్వగట్టువీధిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



గార: పూసపాటిరేగ పీఠపురం అమ్మవారి ఆలయంలో..



రామలక్ష్మణ కూడలి వద్ద..



కాకివీధిలో ముత్యాలమ్మతల్లి..



సరుబుజ్జిలి: పాతపాడులో..



పొందూరు: కుంకుమ పూజల్లో భక్తులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంకు సమీపంలో సర్వీసు రోడ్డు మలుపు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీముఖలింగానికి చెందిన సురేష్‌కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై వస్తున్న సురేష్‌కుమార్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. జేఆర్‌పురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఎచ్చెర్ల(రణస్థలం), ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని రామతీర్థాల కూడలి వద్ద జేఆర్‌పురం పోలీసులు అయిదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోగా వీటిలో ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. నాలుగు ట్రాక్టర్లకు అనుమతులు ఉన్నాయని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ● ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎచ్చెర్ల పోలీసులు పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తమ్మినాయుడుపేట వద్ద నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.